క్లుప్తంగా

భక్తిభావంతో మానసిక ప్రశాంతత



హోమం నిర్వహిస్తున్న పండితులు

కందుకూరు: నిత్యం కొంత సమయాన్ని భగవంతుడి సేవలో గడపాలని, దీంతో మానసిక ప్రశాంతతో పాటు, సమస్యలను ఎదుర్కొనే ధైర్యం వస్తుందని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి అన్నారు. ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని పులిమామిడి పరిధి నిఖిల్ చేతనా కేంద్రంలో హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో ఆటుపోట్లను ఎదుర్కోవాలంటే సాధనకు మించిన మార్గం మరొకటి లేదని తెలిపారు. భక్తి పెంచుకోవడంతో పాటు.. తోటి వారితో స్నేహంగా మెలగాలని సూచించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

అమావాస్య వేడుకలు



పల్లకిలో స్వామివారిని ఊరేగిస్తున్న భక్తులు

తుక్కుగూడ: జెన్నాయిగూడ ఛత్రగిరి లక్ష్మీనర్సింహా స్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారిని ఆలయ మాడ వీధుల్లో పల్లకీలో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసరావు, పూజారులు అజయ్‌శర్మ, మురళిశర్మ, భక్తులు పాల్గొన్నారు.

మండపాలు సిద్ధం



రావిర్యాలలో.. ఏర్పాటు చేసిన మండపం

తుక్కుగూడ: దేవీ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని పలు సంఘాల ఆధ్వర్యంలో మండపాలను ఏర్పాటు అయ్యాయి. సోమవారం అమ్మవారిని ప్రతిష్ఠించేందుకు పుర పరిధి తుక్కుగూడ, రావిర్యాల, మంఖాల్, సర్దార్‌నగర్‌లో.. ఆకర్షణీయంగా భారీ సెటింగులను నిర్వాహకులు తీర్చిదిద్దారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ఎల్‌బీనగర్: కాలనీల్లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. ఎస్‌కేడీ నగర్ నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం కార్పొరేటర్‌ను కలిసి కాలనీలో సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎలాంటి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం కార్పొరేటర్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, శ్రీధర్‌రావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలో లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ హైట్స్, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ క్యాపిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని లయన్స్ క్లబ్ 320–డీ గవర్నర్ లయన్ అమర్నాథ్ రావు ప్రారంభించారు. శిబిరంలో పాల్గొన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అమరేందర్‌రెడ్డి, రమాదేవి, ముస్కు అంజిరెడ్డి, మల్లికార్జున్ రావు, పోచంపల్లి ఇంద్రసేనరెడ్డి, విజయ, మన్నన్,భారత రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

పార్కు ప్రారంభం

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధి ఎఫ్‌సీఐ కాలనీ అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎఫ్‌సీఐ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన పార్కును ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. హుడా చైర్మన్, ఎమ్మెల్యేగా పలు కాలనీలలో ఎన్నో పార్కులను అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిట్టా రాజశేఖర్‌రెడ్డి, చింతల రవికుమార్, శ్రీధర్‌గౌడ్, మధుగౌడ్ పాల్గొన్నారు.

ప్రశాంతతకు ఆలవాలం..


బాలాజీ ఆలయం



బాలాజీ వేంకటేశ్వర స్వామి ఆలయం

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు

- ముస్తాబైన దేవాలయం
- తరలి రానున్న భక్తజనం



కోనేరు గట్టున కాళేయ మర్దిని విగ్రహం

మహేశ్వరం: చుట్టూ పంట పొలాలు. కొండలు, కోనేరుల నడుమ ప్రశాంత వాతావరణంలో కొలువైన బాలాజీ వేంకటేశ్వర స్వామి.. భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతున్నారు. మామిడిపల్లికి కిలో మీటర్ దూరంలో ఉన్న ప్రాచీన కాలం నాటి ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. జిల్లాలోని మహేశ్వరం దేవాలయం, అమ్మపల్లి, మామిడిపల్లి ఆలయాలు ఒకేసారి నిర్మించినట్లు ప్రసిద్ధి. అక్కన్న మాదన్నల హయాంలో నిర్మించిన ఈ ఆలయం.. నిజాం నవాబుల కాలంలో ప్రధానిగా ఉన్న మహారాజ కిషన్ పరిషాద్ పర్యవేక్షణలో ఉండేదని పూర్వికులు తెలిపారు. నేటి నుంచి వారం రోజుల పాటు ఆలయ బ్రహ్మోత్సవాలు కొనసాగనున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

శిల్పకళా వైభవం

పూర్తిగా రాతి కట్టడంతో వెలసిన బాలాజీ ఆలయం.. శిల్పకళా వైభవానికి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. ఆలయ గర్భగుడిలో నల్లరాతితో కొలువైన స్వామి వారికి, కుడి వైపున శ్రీదేవి, ఎడమ వైపున భూదేవిలు ఆసీనులయ్యారు. ప్రధాన ద్వారానికి ఇరు వైపులా జయ, విజయంలు కొలువుదీరారు. స్వామి వారి ఆలయ మండపాన్ని పద్మములచే లిఖించిన 30 రాతి స్తంభాలతో నిర్మించారు. గర్భగుడి గోపురంపై విశేషమైన దేవతా మూర్తులు, దశావతారాలు చెక్కబడ్డాయి. ముఖ్యంగా దేవాలయ మండపం ఎదుట రాతితో శ్రీకుర్మం(తాబేలు) ముద్రించారు. ఇలాంటివి ప్రాచీన ఆలయాలకే ప్రత్యేకంగా ఉంటాయి. గర్భగుడికి ఎదురుగా గరుడ అల్వార్, ధ్వజ స్తంభాలున్నాయి. ఉత్సవాల సమయంలో స్వామి వారిని శేష, గరుడ, హనుమత్ వాహనాలపై ఊరేగించడం ఇక్కడి విశేషం. గర్భగుడి గోపురం మాదిరిగానే సింహద్వారాన్ని నిర్మించారు. అక్కడి కోనేరు సైతం రాత్రి కట్టడంతోనే నిర్మించారు. అందులో అన్నికాలల్లో నీరు పుష్కలంగా ఉంటుంది.

దినదినాభివృద్ధి

దాతల సహకారంతో ఆలయ ప్రాంగణంలో పార్కు, స్వాగత కమాన్, కోనేరుపై కాళేయ మర్దిని విగ్రహం, గోశాలలో శ్రీకృష్ణుడి విగ్రహం, ఆలయ ప్రాకారంపై దశావతరాల నిర్మాణం, గర్భగుడిపై ప్రాకారం నిర్మించి, ఆలయాన్ని చక్కగా తీర్చిదిద్దారు. ఈ అదనపు సొబగులతో గుడికి భక్తుల తాకిడి, దేవాదాయ శాఖకు ఆదాయం పెరిగింది. ఇక్కడ సీరియల్ షూటింగ్‌లు, ప్రత్యేక పాటల షూట్‌లు జరుగుతున్నాయి.

రోజువారీ కార్యక్రమాలు

నేడు విష్వక్సేనారాధన, అంకురార్పణ, నివేదన, తీర్థప్రసాద గోష్ఠి కార్యక్రమాలతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం. 23న ఉదయం 7 గంటలకు బాలబోగం, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ హవనం, ధ్వజారోహణం, నివేదన, తీర్థప్రసాద గోష్ఠి, సాయంత్రం 6 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, హవనం, దేవతాహ్వానం. 24న ఉదయం 7 గంటలకు బాలబోగం, శాంతిపాఠం, 11 గంటలకు స్వామివారి తిరుకల్యాణ మహోత్సవం, సాయంత్రం 5 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, శేష వాహన నివేదన. 25న గరుడ వాహన సేవ, 26న హనుమంత సేవ, 27న చక్రతీర్థం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

కొండకు ఎదురుగా కోవెల

వెయ్యేళ్ల క్రితం శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి మామిడిపల్లి శివారులోని భారీ కొండపై స్వయంభుగా వెలిశారు. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో అక్కడ పూజా కైంకర్యాలకు కష్టంగా మారింది. దీంతో ఈ ప్రాంతాన్ని పాలించే రాజుకు.. స్వామివారు కలలో వచ్చి, కొండకు ఎదురుగా ఆలయాన్ని నిర్మించాలని చెప్పారని, దాంతో ఆయన కొండకు ఎదుట ఈ కోవెలను నిర్మించినట్లు ప్రచారంలో ఉంది. ఇప్పటికీ ఆ కొండపై ప్రత్యేక పూజలు కొనసాగుతుండటంతో.. కొండను దేవుడిగుట్టగా భక్తులు పిలుస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి



ఏటా ఉత్సవాలు ఘనంగా జరుగుతుంటాయి. ఆలయ బ్రహ్మోత్సవాల నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు చేశాం. భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని రకాల చర్యలు చేపట్టాం. నిరంతరం పర్యవేక్షిస్తాం.

– క్లాం నరేష్ గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్

నేటి నుంచి దేవీ నవరాత్రోత్సవాలు



రాజరాజేశ్వర ఆలయం

ముస్తాబైన శివగంగ రాజరాజేశ్వర స్వామి ఆలయం



కొలువైన మూలవిరాట్

మహేశ్వరం: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలకు శివగంగ రాజరాజేశ్వర స్వామి ఆలయం ముస్తాబైంది. నేటి నుంచి అక్టోబర్ 2వ వేడుకలు జరగనున్నాయి. ఉత్సవాల నేపథ్యంలో అమ్మవారు రోజుకో రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకోనున్నారు. తొలుత నేడు బాలత్రిపుర సుందరి దేవిగా పూజలు అందుకోనున్నారు. 23న గాయత్రి, 24న అన్నపూర్ణ, 25న కాత్యాయిని, 26న మహాలక్ష్మి, 27న లలితా త్రిపుర సుందరి, 28న మహాచండి, 29న సరస్వతి, 30న దుర్గాదేవి, 1న మహిషాసుర మర్దిని, 2న విజయ దశమి(దసరా) రోజున రాజరాజేశ్వర దేవి అలంకారంలో అమ్మవారు భక్తులను అలరిస్తారు. ఈ సందర్భంగా షమీ పూజ, రావణ దహనం కార్యక్రమాలను నిర్వహించనున్నామని ఆలయ ఈఓ మురళీకృష్ణ, డైరెక్టర్లు ఎం.రాకేష్, ఎ.రాకేష్, ఎస్.కన్నయ్య, కె.జగన్, ఎ.సాయిలు, కె.శ్రీశైలం, పూజారులు వీరేశం, రాజు పంతులు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కమార్ తెలిపారు.

నషాముక్త్ భారత్‌కు కృషి

బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్

మొయినాబాద్‌రూరల్: నషాముక్త్ భారత్ చేయడానికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎంతో కృషి చేస్తున్నారని బీజేపీ యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గణేశ్ గుండె, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్‌నగర్ ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఆదివారం డ్రగ్స్ రహిత భారత లక్ష్యంగా ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో 3కే రన్ కార్యక్రమం నగరంలో నిర్వహించారు. దీనికి మొయినాబాద్ మండలం నుంచి బీజేపీ నాయకులు పెద్ద ఎత్తున బయలుదేరారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ పరిపాలన కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని వారు చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎస్.రత్నం, మధుసూదన్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, నర్సింహారెడ్డి, రాజమల్లేష్, శివకుమార్, రవీందర్‌రెడ్డి, అశోక్ యాదవ్, సుధాకర్‌రెడ్డి, యువకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటు బ్యాంకే ముఖ్యం

బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తయ్య



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

కందుకూరు: కాంగ్రెస్ పార్టీకి బీసీల పట్ల నిజమైన ప్రేమ లేదని, ఓటు బ్యాంకు కోసమే 42 శాతం రిజర్వేషన్లని ఆ పార్టీ నేతలు చెబుతున్నారని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎగ్గిడి సత్తయ్య విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలపై ప్రేమ ఉంటే.. ఆ వర్గం బిడ్డలైన కందుకూరు, మహేశ్వరం మండలాల పీఏసీఎస్ చైర్మన్లు చంద్రశేఖర్, పాండుయాదవ్‌ను తొలగించి, ఓసీలను ఎలా నియమించారని ప్రశ్నించారు. ఇలా చేస్తూ.. రిజర్వేషన్లు కల్పిస్తామంటే ఎలా నమ్మాలన్నారు. బీసీ సంఘం మండల ఉపాధ్యక్షుడు రవీందర్‌గౌడ్, కురుమ సంఘం మండల అధ్యక్షుడు పాండు, కుమ్మర సంఘం అధ్యక్షుడు రవి, వడ్డెర సంఘం అధ్యక్షుడు శ్రీరాములు, రజక సంఘం జిల్లా నాయకుడు బి.మల్లేశ్, మాజీ సర్పంచ్ గణేశ్, బీసీ నాయకులు రమేష్, జి.అంజయ్య, పి.కృష్ణ, శ్రీ కాంత్, అనిల్, రావిచెట్టు రవీందర్ పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

సీపీఎం డివిజన్ కార్యదర్శి రాజు



పంట పొలాలను పరిశీలిస్తున్న నాయకులు, రైతులు

షాద్‌నగర్: ట్రిపుల్‌ఆర్ అలైన్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే మార్చాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి ఎస్.రాజు డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పరిధిలోని అయ్యవారిపల్లి, చించోడ్, భీమారం, ఉప్పరిగడ్డ తండాల మీదుగా రీజనల్ రింగ్ రోడ్డును నిర్మించే ప్రాంతాలను ఆదివారం సీపీఎం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులతో మాట్లాడి పంట పొలాలను సందర్శించారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. రైతులు పంటలు పండించే పచ్చని పంట పొలాల గుండా రోడ్డును నిర్మించడం సరికాదన్నారు. పాడి పంటలు, వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు రోడ్డున పడాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఆయా గ్రామాల్లో రైతులు సుమారు 300 ఎకరాల భూమిని కోల్పోవాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం గతంలో చేసిన మార్కింగ్ ప్రకారమే రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. రైతులకు అన్యాయం చేస్తే పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామస్తులు శ్రీనునాయక్, సుదర్శన్ రెడ్డి, వెంకటయ్య, చంద్రకాంత్, రజినీకాంత్, సత్యం, సాయన్న, సత్తయ్య, శ్రీధర్‌నాయక్, సూర్యనాయక్, భాస్కర్, హరీష్, శ్రీకాంత్, వెంకటయ్య, మాధవి, నవీన్, శివ, నర్సింలు, కృష్ణ, సాయన్న, జ్యోతి బాబు, గోపాల్, సురేష్, శివయ్య, సత్యం, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ గోమాతను పూజించాలి

వాసవీ క్లబ్ అధ్యక్షుడు కల్వమాణిక్యం



గోపూజలో వాసవీ, వనితాక్లబ్ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: సకల దేవతల నిలయమైన గోమాతను ప్రతిఒక్కరూ పూజించాలని వాసవీక్లబ్ అధ్యక్షుడు కల్వమాణిక్యం అన్నారు. మహాలయ అమావాస్యను పురస్కరించుకొని పట్టణ సమీపంలోని చౌడమ్మగుట్ట ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలోగల శ్రీకృష్ణ గోశాలలో ఆదివారం వాసవీ, వనితాక్లబ్ ఆధ్వర్యంలో గోపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గోమాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనని అన్నారు. గో సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో వనితాక్లబ్ అధ్యక్షురాలు కల్వమధుప్రియ, వాసవీ క్లబ్ కోశాధికారి సురేష్ కుమార్, జోన్ చైర్మన్ వెంకటరమణ, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులుగుప్తా, సభ్యులు నందకిషోర్, మురళి, రవికుమార్, పాండు, శ్రీనివాస్, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని కట్టమైసమ్మ, పోచమ్మ దేవాలయంవద్ద అమావాస్యను పురస్కరించుకొని ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. దాత జీటీ.సంతోష్, శ్యామల దంపతుల సహకారంతో ఆలయానికి వచ్చే భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. ప్రతినెల అమావాస్యను పురస్కరించుకొని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామన్నారు. దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు భిక్షపతి, అధ్యక్షుడు శ్రీధర్, ఉపాధ్యక్షులు సంతోష్, రమేష్, కోశాధికారి రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శి జంగరాజ్, ప్రచార కార్యదర్శి సురేష్, సభ్యుల భరత్, కృష్ణ, తరుణ్, భాను, శ్రీకాంత్, శివ, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఉరేసుకుని వృద్ధురాలి ఆత్మహత్య

చైతన్యపురి: చెరువు కట్ట రెయిలింగ్‌కు ఓ వృద్ధురాలు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం చెరువు కట్ట రెయిలింగ్ రాడ్‌కు గుర్తు తెలియని ఓ వృద్ధురాలు ఉరేసుకున్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులుకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

హస్తినాపురం: చికిత్స పొందుతూ గుర్తు తెలియని మహిళ మృతి చెందిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సాగర్ రహదారిపై ఉన్న విపస్యధ్యానకేంద్రం దగ్గర ఈ నెల 13న గుర్తుతెలియని మహిళ 55) స్పృహ కోల్పోయి కిందపడి ఉన్నట్లు స్థానికుల సమాచారం మేరకు పోలీసులకు ఘటనా స్థలానికి చేరుకుని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

చెరువులో మృతదేహం లభ్యం

చైతన్యపురి: సరూర్‌నగర్ చెరువులో వ్యక్తి మృతదేహాన్ని సరూర్‌నగర్ పోలీసులు గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి వివరాల ప్రకారం.. ఆదివారం చెరువులో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని బయటకు తీయించి ఉస్మానియా మార్చురీకి తరలించారు. మృతుడికి వయస్సు 40–45 ఏళ్లు ఉంటుందని ముస్లిం వర్గానికి చెందిన వ్యక్తి అని సంబంధీకులు ఉంటే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు.

జీవో 99ను సవరించాలి

మన్సూరాబాద్: మాల జాతిని అణచి వేయాలనే కక్షతో సీఎం రేవంత్‌రెడ్డి జీవో నెంబర్ 99 ప్రవేశపెట్టి ఎస్సీలోని 58 కులాలకు అన్యాయం చేస్తున్నారని. వెంటనే ఆ జీవోను సవరించాలని తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ నాయకులు డాక్టర్ మందుల భాస్కర్, బేర బాలకిషన్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్‌బీనగర్ ఎమ్మె ల్యే సుధీర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ.. గ్రూప్–3లో ఉన్న మాల, మాల ఉపకులాలకు విద్యా, ఉద్యోగాల్లో రో స్టర్ పా యింట్ 22 సృష్టించి విద్యార్థులు ఉన్నత చదువులు చదవకుండా, ఉద్యోగా లు పొందకుండా, ఉద్యోగం పొందిన వారు ప్రమోషన్ పొందకుండా అన్యాయం చేస్తున్నారన్నారు.

బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో..

తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ సంబురాలు ప్రారంభం అయ్యాయి. తొలిరోజు ఆదివారం ఎంగిలి పూల బతుకమ్మ పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆడబిడ్డలు తంగేడు, గునుగు, బంతి తదితర పుష్పాలతో పూలగోపురాలను అందంగా పేర్చారు. వీధుల్లో ప్రతిష్ఠించి, బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆడిపాడారు. వరుణుడు అంతరాయం కలిగించినప్పటికీ.. వర్షంలోనే సందడి చేశారు. అనంతరం చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. – సాక్షి, నెట్‌వర్క్



కందుకూరు: ఆలయం ఎదుట బతుకమ్మ ఆడుతున్న మహిళలు



తుక్కుగూడ: సిరి టౌన్‌షిప్‌లో..



తుక్కుగూడ: బతుకమ్మతో చిన్నారి



మహేశ్వరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



మీర్‌పేట: జిల్లెలగూడలో..



మీర్‌పేట: సిర్లాహిల్స్‌లో..



బడంగ్‌పేట్: ఓయూలో.. మాజీ మేయర్ పారిజాత తదితరులు